
సాక్షి
హనుమకొండ

శుక్రవారం | 31 | మే | 2024

ఆన్సర్ బుక్‌లెట్‌లనే మార్చేస్తున్నారు..

- కేయూ పరీక్షల విభాగంలో ఇంటిదొంగల దందా
- పోలీసుల అదుపులో ఇద్దరు దినసరి కూలీలు
- మరో పదిమంది సెల్‌ఫోన్‌లు సీజ్
- ఒక్కో పేపర్‌కు రూ.5వేలు వసూలు

- వివరాలు 8లో▸



న్యూస్‌రీల్

పొగాకు వాడకం వల్ల ఎన్నో అనర్థాలు



ఎంజీఎం: పొగాకు వాడకం వల్ల ఎన్నో అనర్థాలతోపాటు ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందని హనుమకొండ డీఎంహెచ్ఓ డాక్టర్ సాంబశివరావు తెలిపారు. పొగాకు వాడకం వల్ల కలిగే ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రపంచ ఆరోగ్య సంస్థ సభ్య దేశాలు 1987 నుంచి ప్రతియేటా మే 1న ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవంగా జరిపేందుకు నిర్ణయించిందని తెలిపారు. విస్తృతంగా పెరుగుతున్న పొగా వ్యసనాన్ని అరికట్టేందుకు జిల్లాలో పోలీస్‌శాఖ సమన్వయంతో సిగరేట్స్ అండ్ అదర్ టొబాకో ప్రొడక్ట్స్ యాక్ట్ -2003 అమలు కోసం ప్రత్యేక డ్రైవ్‌లు చేపట్టాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఇప్పటివరకు జిల్లాలో విద్యాశాఖ సహకారంతో 72 విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి టొబాకో ఫ్రీ సంస్థలుగా ప్రకటించినట్లు వివరించారు. ఈ మేరకు ప్రజలు సహకరించి పొగాకు రహిత భవిష్యత్తును సృష్టించడానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన కోరారు.

ఇంటర్‌లో 598మంది గైర్హాజరు

విద్యారణ్యపురి: హనుమకొండ జిల్లాలో గురువారం నిర్వహించిన ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షల్లో 598 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఫస్టియర్‌లో 3,894మందికిగాను 3,441 మంది హాజరుకాగా 453మంది గైర్హాజరయ్యారని డీఐఈఓ గోపాల్ తెలిపారు. సెకండియర్‌లో 1595మందికిగాను 1450మంది హాజరుకాగా 145మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు.

వరంగల్‌లో 169మంది..

కాళోజీ సెంటర్: వరంగల్ జిల్లాలో ఫస్టియర్‌లో 1,867 మంది విద్యార్థులకు 1,750 మంది హాజరుకాగా, 117 మంది గైర్హాజరైనట్లు డీఐఈఓ కె.మాధవరావు తెలిపారు. సెకండియర్ పరీక్షకు 876 మందికిగాను 824 మంది హాజరుకాగా, 52మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు పేర్కొన్నారు.

సంస్థ అభివృద్ధికి పాటుపడాలి



హన్మకొండ: ప్రతి ఒక్కరూ సంస్థ అభివృద్ధికి పాటుపడాలని టీజీఎస్ ఆర్టీసీ వరంగల్-1 డిపో మేనేజర్ వంగల మోహన్‌రావు అన్నారు. గురువారం హనుమకొండలోని వరంగల్-1 డిపోలో జరిగిన కార్యక్రమంలో ఏప్రిల్ మాసంలో విధుల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన డ్రైవర్, కండక్టర్‌లకు శాలువా కప్పి సన్మానించి ప్రశంసపత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఉద్యోగీ ఆదాయం పెంపుపై దృష్టి సారించాలన్నారు. ప్రయాణికుల పట్ల మర్యాదగా ఉంటూ ఆర్టీసీ వైపు ఆకర్షితులను చేయాలన్నారు. ఆక్యుపెన్సీ రేషియో పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మెకానికల్ ఇంజనీర్ శ్రీనివాసులు, అసిస్టెంట్ మేనేజర్ సంతోష్, డిపో సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ సహకారంతో మహిళలకు ఉపాధి

డీఆర్‌డీఓ నాగపద్మజ



కమలాపూర్: ప్రభుత్వ సహకారంతో మహిళలకు మంచి ఉపాధి దొరుకుతుందని డీఆర్‌డీఓ నాగపద్మజ అన్నారు. కమలాపూర్, ఉప్పల్ గ్రామాల్లో మహిళా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యూనిఫామ్ స్టిచ్చింగ్ సెంటర్లను గురువారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ విద్యార్థుల యూనిఫామ్స్ తయారు చేసే పద్ధతిని పరిశీలించి మహిళలను అభినందించారు. నిర్ణీత సమయంలో కుట్టు పని పూర్తి చేసి అందించాలని సూచించారు. యూనిఫామ్‌లను నాణ్యతగా కుట్టాలని, సైజుల్లో తేడా రావొద్దన్నారు. కార్యక్రమాల్లో ఎంపీడీఓ గుండె బాబు, ఐకేపీ ఏపీఎం నారాయణ, మండల సమాఖ్య అధ్యక్షురాలు సుజాత, ఐకేపీ సీసీలు, వీఓఏలు, మహిళా సంఘ నాయకురాళ్లు, ఉపాధి హామీ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

ఛీ.. స్టార్ హోటళ్లు!

నగరంలోని పలు హోటళ్లు, రెస్టారెంట్లలో డొల్లతనం ● పైన పటారం.. లోన లొటారమే



హనుమకొండ చౌరస్తాలోని అశోక హోటల్. నగరంలోనే పేరు మోసిన హోటల్‌కమ్ రెస్టారెంట్. అందులో పెద్ద పెద్ద వాళ్లు స్టే చేస్తుంటారు. స్టార్ హోటల్ మాటున కల్తీ జరుగుతున్నట్లు గుర్తించారు ఫుడ్ సేఫ్టీ అధికారులు. తాజా తనిఖీల్లో హానికరమైన కృత్రిమ రంగులు కలిపిన ఆహారపదార్థాలను గుర్తించడంతోపాటు భారీగా రంగు డబ్బాలు, కాలం చెల్లిన వివిధ ఆహార పదార్థాలను సీజ్ చేశారు.

- సాక్షిప్రతినిధి, వరంగల్



నగరంలోని శ్రేయ, అరణ్య జంగల్ థీమ్ రెస్టారెంట్లు. పేర్లు ఇలా కొత్తగా పెట్టి భోజన ప్రియులను ఆకర్షించడంలో ఉన్న శ్రద్ధ ఆహార పదార్థాల తయారీలో లేదు. అధికారుల తనిఖీలో బూజు పట్టిన కూరగాయలను వాడుతున్నట్లు తేలింది. కాలం తీరిన 26 కేజీల మాంసపు ఉత్పత్తులను గుర్తించగా, వాటిని పారబోసి నోటీసులు జారీ చేశారు.

అధికారులు గుర్తించిన ఈ హోటళ్లలోనే కాదు.. గ్రేటర్ వరంగల్‌లో పలు హోటళ్లలో నాణ్యత లేని ఆహారం ప్రజల ఆరోగ్యం గుల్ల చేస్తున్నాయి. కనీస శుచీ శుభ్రత పాటించడం లేదు. నాణ్యమైన సరకులు, తాజా కూరగాయలు వాడడం లేదు. వడ్డిస్తున్న ఆహార పదార్థాలు సైతం నాసిరకం, పాడైపోయినవి ఉంటున్నాయి. నిత్యం తనిఖీలు నిర్వహించి జరిమానాలు విధించాల్సిన శాఖ రెండు రోజులుగా తనిఖీలకు శ్రీకారం చుట్టింది. సిబ్బంది లేమీ కారణంగా చూపుతున్న ఆహార తనిఖీ అధికారులు గురువారం చేసిన పరిశీలనలో తేలుతున్న వాస్తవాలు ఆందోళన కలిగిస్తున్నాయి. పెద్దపెద్ద పేరున్న హోటళ్లలో సైతం కనీస నిబంధనలు పాటించడం లేదంటూ పెదవి విరుస్తున్నారు.

రోగాల బారిన జనాలు..
ఆహార కల్తీనే కారణం..

గ్రేటర్ వరంగల్‌లోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో చేరుతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. కరోనా తర్వాత అన్ని నగరాలు, పట్టణాలతోపాటు గ్రేటర్ వరంగల్‌లో బయట తింటున్న వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. ఇందుకు తగినట్లుగా ఇదివరకున్న హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లకు 10నుంచి 20 శాతం కొత్తగా వెలిశాయి. శని, ఆదివారాల్లో ఎక్కువ కుటుంబాలు రెస్టారెంట్లకు వెళ్లడానికే ఆసక్తి చూపుతున్నారు. వరంగల్ నగరంతో పాటు చుట్టపక్కల ప్రాంతాలకు చెందిన వారు రోజుకు 50 నుంచి 100 మంది వరకు కడుపునొప్పి, వాంతులు, విరేచనాలు, దురద తదితర సమస్యలతో చేరుతున్నట్లు వైద్యులు నిర్ధారించారు. ఇందులో 70 నుంచి 80 శాతం మందికి ఆహారం సరిగ్గా లేకపోవడం, బయటి పదార్థాలు తీసుకోవడం వల్లే ఇబ్బంది పడుతున్నట్లు కూడ చెబుతున్నారు. రెండు వారాల క్రితం ఫుడ్ పాయిజనింగ్‌తో నలుగురు ఎంజీఎం ఆస్పత్రిలో చేరగా.. నగరంలో నెలలో సుమారు 48 కేసులు హోటళ్లు, బార్ అండ్ రెస్టారెంట్‌లో తిని రోగాలు కొని తెచ్చుకున్నట్లు గుర్తించారు. నిత్యం ఫుడ్ పాయిజనింగ్ సమస్యతో బాధ పడుతున్న వారి సంఖ్య కూడా ఎక్కువగానే ఉంటుందని, అయితే వారు మెడికల్ షాపులు, ఆర్ఎంపీలను సంప్రదించి మందులు తాత్కాలికంగా ఉపశమనం పొందుతున్నారని వైద్యులు చెప్తున్నారు.

మొక్కుబడిగా తనిఖీలు..
నిర్లక్ష్యంగా నిర్వాహకులు...

10.80 లక్షలకు పైగా జనాభా ఉన్న గ్రేటర్ వరంగల్ నగరంలో ఆహార తనిఖీ శాఖ పర్యవేక్షణ అంతంత మాత్రంగానే ఉంది. దాదాపు రెండు వేలకు పైగా హోటళ్లు, రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, మరో రెండు వేల వరకు తినుబండారాల దుకాణాలున్నాయి. వీటిలో తరచూ అధికారులు తనిఖీలు నిర్వహించాల్సి ఉన్నా.. సిబ్బంది కొరత కారణంగా సాధ్యం కావడం లేదంటున్నారు. ఎక్కడైనా పదే పదే ఫిర్యాదు అందితేనే అధికారులు స్పందిస్తున్నారు. పైగా అప్పటికప్పుడు ఘటనా స్థలానికి వచ్చిన దాఖలాలుండటం లేదు. ప్రధాన పట్టణాల్లో ముందస్తు తనిఖీ జాడలు అసలే లేవు. కేవలం ఏడాదిలో ఇన్ని తనిఖీలు చేశామని నివేదికల తయారీ కోసం అప్పుడప్పుడు సోదాలు నిర్వహిస్తూ చేతులు దులిపేసుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. తనిఖీలు లేని కారణంగా చాలా హోటళ్లలో శుచి విషయంలో పట్టించుకున్న నాథుడే లేడని నగరవాసులు వాపోతున్నారు. హైదరాబాద్ మహానగరంలో ఇటీవల నిర్వహించిన తనిఖీల్లో వెలుగుచూసిన సంఘటనల నేపథ్యంలో ఎట్టకేలకు గ్రేటర్ వరంగల్‌లో తనిఖీలకు ఆహార కల్తీ నియంత్రణ అధికారులు కదిలారు. ఇదిలా ఉండగా ఆహార కల్తీ నిరోధక చట్టం(ప్రివెన్షన్ ఆఫ్ ఫుడ్ అడల్ట్రేషన్ యాక్ట్) ప్రకారం అధికారులు, సిబ్బందిని నియమించాలని కూడా కోరుతున్నారు.

- అక్కడి ఫుడ్ తింటే రోగాలు వెంటే
- ఆహార నిబంధనలు పట్టని యజమానులు
- తాజా తనిఖీల్లో డొల్లతనం బట్టబయలు
- పేరుమోసిన హోటళ్లలో కల్తీ ఆహార పదార్థాల గుర్తింపు



అరణ్యం రెస్టారెంట్‌లో కుళ్లిన మాంసం



అశోక్ హోటల్ నిర్వాహకుడికి నోటీసు అందజేస్తున్న అధికారులు



మరో హోటల్‌లో నిల్వ ఉన్న చికెన్‌ను పరిశీలిస్తున్న ఫుడ్‌సేఫ్టీ అధికారులు

కుళ్లిన మాంసం.. బూజు పట్టిన చేప ముక్కలు

- ఆహార పదార్థాల్లో పురుగులు.. కాలం చెల్లిన సరుకులు
- హనుమకొండలోని మూడు హోటళ్ల తనిఖీలో వెలుగులోకి..
- హోటల్ అశోకతోపాటు మరికొన్నింటికి నోటీసులు

- వివరాలు 8లో▸

మూడు రోజుల్లో పనులు పూర్తి చేయాలి



అమ్మ ఆదర్శ పాఠశాల పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్



విత్తన దుకాణంలో రిజిస్టర్‌ను తనిఖీ చేస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

- కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశం
- పరకాలలో అమ్మ ఆదర్శ పాఠశాల పనుల పరిశీలన
- విత్తనాల దుకాణాల ఆకస్మిక తనిఖీ

పరకాల: అమ్మ ఆదర్శ పాఠశాల పనులు మూడు రోజుల్లో పూర్తి చేయాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులను ఆదేశించారు. పెండింగ్ పనులను పూర్తి చేస్తేనే బిల్లులు మంజూరు చేస్తామని సంబంధిత కాంట్రాక్టర్‌లకు ఆమె స్పష్టం చేశారు. పరకాల మండలం కామారెడ్డిపల్లి ప్రాథమిక ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పనులను గురువారం ఆమె పరిశీలించారు. అదే విధంగా పరకాల పట్టణంలోని ఉర్దూ పాఠశాల పనులను పరిశీలించిన కలెక్టర్ అసంపూర్తిగా ఉన్న వాటిని త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పనులు పూర్తయ్యాక పెయింటింగ్ చేసి బెంచీలు, కుర్చీలు తదితర సామగ్రిని సరఫరా చేస్తామని తెలిపారు. పాఠశాల ఆవరణలో ఉన్న మొక్కలను అందంగా తీర్చిదిద్దాలని సూచించారు.

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు:

నకిలీ విత్తనాలు అమ్మినా, రైతులకు ఎక్కువ ధరకు విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ సిక్తా పట్నాయక్ హెచ్చరించారు. కొద్ది రోజులుగా కొందరు వ్యాపారస్తులు మార్కెట్‌లో పేరున్న పత్తి విత్తనాలను అధిక ధరలకు విక్రయిస్తున్నారనే సమాచారంతో కలెక్టర్ పరకాల పట్టణంలోని పలు విత్తన దుకాణాలను ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించిన ఆమె నకిలీ విత్తనాలు, బ్లాక్‌లో విక్రయాలు చేపడితే సంబంధిత వ్యాపారస్తుల లైసెన్స్‌లు రద్దు చేసి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వ్యవసాయశాఖ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి వెంకటనారాయణ, ఆర్డీఓ కె.నారాయణ, జేడీఏ రవీందర్ సింగ్, ఏడీఏ రవీందర్‌రావు, ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు, మున్సిపల్ కమిషనర్ నర్సింహ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు తొందరపడి విత్తనాలు వేయొద్దు

హన్మకొండ: రైతులు తొందరపడి విత్తనాలు వేయొద్దని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. రెండు మూడు వర్షాలు కురిసి భూమి చల్లబడిన తర్వాత 60 నుంచి 70 మిల్లీ మీటర్ల వర్షం కురిసిన తర్వాతే విత్తనాలు విత్తుకోవాలని సూచించారు. గురువారం హనుమకొండ కలెక్టరేట్‌లో జిల్లా, డివిజన్, మండల స్థాయి వ్యవసాయ అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆమె మాట్లాడుతూ జిల్లాలో ఈ వానాకాలంలో 2,40,220 ఎకరాల్లో పంటలు సాగు చేస్తారని వ్యవసాయశాఖ ప్రణాళిక రూపొందించిందన్నారు. విత్తనాల కొనుగోలులో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై 225 గ్రామాల్లో ప్రచార సదస్సులు నిర్వహించి అవగాహన కల్పించారన్నారు. జిల్లాలో నకిలీ విత్తనాలు, విక్రయం, కృత్రిమ కొరతను అరికట్టడానికి జిల్లా, మండల స్థాయి టాస్క్‌ఫోర్సు బృందాలు ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. పత్తి 85 వేల ఎకరాల్లో సాగు చేయనున్నారని, దీనికిగాను 2,50,410 ప్యాకెట్ల విత్తనాలు అవసరం కాగా ఇప్పటివరకు 88,790 విత్తన ప్యాకెట్లు అమ్మకాలు జరిగాయని, మరో 1,61,620 ప్యాకెట్లు డీలర్ల వద్ద అందుబాటులో ఉన్నాయని వివరించారు. పత్తి విత్తనాల కొరత లేదని, రైతులు ఆందోళన చెందొద్దన్నారు. విత్తనాలను వ్యాపారులు ఎమ్మార్పీకే విక్రయించాలన్నారు. కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అన్ని రకాల పత్తి విత్తనాలు బీజీ-2 టెక్నాలజీతో తయారయినవేనని, ఒకే రకమైన దిగుబడి వస్తుందన్నారు. పచ్చిరొట్ట విత్తనాలైన జనుము, జీలుగ రాయితీపై అందుబాటులో ఉన్నాయన్నారు. జిల్లాకు జనుము 150 క్వింటాళ్లు, జీలుగ 3,200 క్వింటాళ్ల విత్తనాలు కేటాయించినట్లు వివరించారు. ఇప్పటివరకు 10 క్వింటాళ్ల జనుము, 2,269 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు రైతులు తీసుకెళ్లారని తెలిపారు. మరో 447 క్వింటాళ్లు త్వరలో వస్తాయని, అదనంగా 500 క్వింటాళ్లకు ప్రతిపాదనలు పంపించామన్నారు. పచ్చిరొట్ట పైర్లలో జనుము, జీలుగతో పాటు ప్రత్యామ్నాయంగా పెసర్లు, బొబ్బెర వంటి విత్తనాలు విత్తుకోవచ్చన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి రవీందర్ సింగ్, సహాయ సంచాలకులు, మండల వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

గ్రూప్-1 పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు

హన్మకొండ అర్బన్: వచ్చేనెల 9న హనుమకొండ జిల్లాలో నిర్వహించే గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్.. అధికారులను ఆదేశించారు. గ్రూప్ -1 పరీక్ష నిర్వహణపై గురువారం కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించి సూచనలు చేశారు.



మే పుష్పం

ప్రకృతి ప్రియుల మనుసు దోచే మే పుష్పం విరబూసింది. ఈ నెలమొదటి వారంలో మొగ్గ తొడిన పుష్పం గురువారం విరబూసింది. దామెరలోని రిటైర్డ్ టీచర్ హింగె బాబురావు ఇంటి ఆవరణలో వికసించిన మే పుష్పాన్ని స్థానికులు ఆసక్తిగా చూస్తున్నారు. - దామెర

హాజరుపై నజర్

- టీజీఎన్‌పీడీసీఎల్‌లో ఉద్యోగ సంఘాల నేతల డుమ్మాపై ఫిర్యాదులు
- గతంలో ఇచ్చిన మినహాయింపులు ఎత్తివేత
- సంకట స్థితిలో నాయకులు

- వివరాలు 8లో▸



తుమ్మ బాలకు నివాళి

హైదరాబాద్ విశ్రాంత అగ్ర పీఠాధిపతి తుమ్మ బాల గురువారం కన్నుమూశారు. ఆయన పార్థివదేహాన్ని ప్రజల సందర్శనార్థం ఫాతిమా కేథడ్రల్ చర్చిలో ఉంచారు. ఓరుగల్లు మేత్రాసనం పీఠాధిపతి రెవరెండ్ డాక్టర్ ఉడుముల బాలతోపాటు పలువురు నివాళులర్పించారు. శుక్రవారం ఉదయం సికింద్రాబాద్‌లోని సెయింట్ మేరీ బసిలికాలో భూస్థాపిత పూజ చేయనున్నట్లు ఫాతిమా కేథడ్రల్ చర్చి కమిటీ సభ్యులు తెలిపారు. - కాజీపేట రూరల్

పీజీ కోర్సుల సెకండియర్ రెండో సెమిస్టర్ పరీక్షలు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో పీజీ కోర్సుల (నాన్ ప్రొఫెషనల్స్) కోర్సుల సెకడియర్ రెండో సెమిస్టర్ పరీక్షలు జూన్ 11వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు పరీక్షల నియంత్రణాధికారి ఎస్.నర్సింహాచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ బీఎస్ఎల్ సౌజన్యజి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఏ , ఎంకాం, ఎమ్మెస్సీ కోర్సులతోపాటు కంప్యూటర్ సైన్స్, ఎంటీఏ, ఎంఎస్‌డబ్ల్యూ, అండ్ ఎంహెచ్ఆర్ఎం , జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్ తదితర కోర్సుల రెండో సెమిస్టర్ పరీక్షల షెడ్యూల్ విడుదల చేశారు. జూన్ 11, 13, 15, 18, 20, 22 తేదీల్లో మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 5గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారని వారు తెలిపారు.

కాకతీయ కళాతోరణం తీసివేయొద్దు..

- రాజముద్రను మార్చడం అవివేకం
- బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్



మాట్లాడుతున్న దాస్యం వినయ్ భాస్కర్

హన్మకొండ: కాకతీయ కళాతోరణం రాచరికపు పోకడలకు గుర్తు కాదని, కాకతీయుల జనరంజక పాలన ఆ తోరణంలో ప్రతిబింబిస్తుందని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తుగ్లక్‌లా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. గురువారం హనుమకొండ నక్కలగుట్టలోని కాకతీయ హరిత హోటల్‌లో టార్చ్ సంస్థ ఆధ్వర్యంలో రౌండు టేబుల్ సమావేశం జరిగింది. సమావేశంలో వినయ్ భాస్కర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పాలకులకు చరిత్రపై అవగాహన లేదని విమర్శించారు. రాజముద్రను మార్చడం అవివేకమన్నారు. ముద్రలో రాచరికపు పోకడలు కనిపిస్తున్నాయనడంలో అర్థం లేనిదన్నారు. కాకతీయుల పాలన అహంకార పూరితంగా సాగలేదని.. జన రంజక పాలన అందించారన్నారు. మశూచి వ్యాధిపై విజయంగా చార్మినార్ నిర్మించారన్నారు. రాజముద్ర అలాగే ఉంటే ప్రజల మదిలో కేసీఆర్ ఉంటారని, మారిస్తే కేసీఆర్‌ను ప్రజలనుంచి దూరం చేయొచ్చనే కుటిల బుద్ధితో ఈ ఆలోచన చేసినట్లుగా ఉందన్నారు. జలగం వెంగళరావు సీఎంగా ఉన్నప్పుడు రాష్ట్రానికి వచ్చే అతిథులకు కాకతీయ కళాతోరణంతో కూడిన జ్ఞాపికలు అందించారని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం కాకతీయ ఉత్సవాలు జరిపిందని, చివరగా కిరణ్ కుమార్ రెడ్డి ప్రభుత్వం కాకతీయ ఉత్సవాలు జరిపిందని గుర్తు చేశారు. జిల్లాకు చెందిన మంత్రులు కొండా సురేఖ, ధనసరి సీతక్క రాష్ట్ర రాజముద్రలో నుంచి కాకతీయ కళాతోరణాన్ని తీసివేయకుండా సీఎం రేవంత్‌పై ఒత్తిడి తీసుకురావాలన్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఈ నెల 31న హనుమకొండలోని కాళోజీ కూడలి వద్ద ఉదయం 10 గంటలకు రాస్తారోకో చేయనున్నట్లు చెప్పారు. కేయూ హిస్టరీ ప్రొఫెసర్ విజయ్ బాబు మాట్లాడుతూ వివేకమంతమైన పాలకులకు చరిత్ర, సంస్కృతీసంప్రదాయాలు తెలిసి ఉండాలన్నారు. రాష్ట్ర రాజముద్ర నుంచి కాకతీయుల కళాతోరణాన్ని తీసివేయడం సమంజసం కాదని, ఇది అవివేకమని విమర్శించారు. ప్రభుత్వం ఈ ఆలోచనను విరమించుకోవాలని సూచించారు. పేరిణి నృత్య కళాకారులు అశోక్, దొడ్డి కొమురయ్య ఫౌండేషన్ చైర్మన్ అస్నాల శ్రీనివాస్, అభిషేక్, రామ్మూర్తితోపాటు పలువురు మాట్లాడుతూ ప్రభుత్వ లోగో మార్పును వ్యతిరేకించారు. ముందుగా టార్చ్ వ్యవస్థాపకుడు అరవింద్ కాకతీయ తోరణం ప్రత్యేకతలను పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. సమావేశంలో మేథావులు, కవులు, కళాకారులు, ఉద్యమకారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

దుస్తులు ఆరేస్తూ మృత్యుఒడికి..

- విద్యుదాఘాతంతో యువకుడి మృతి
- తొర్రూరులో ఘటన


వినీత్‌కుమార్ మృతదేహం

తొర్రూరు: దుస్తులు ఆరేస్తుండగా విద్యుదాఘాతానికి గురై ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన డివిజన్ కేంద్రం తొర్రూరులో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. ఉత్తర్‌ప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్‌కు చెందిన వినీత్ కుమార్(36) కొంత కాలంగా తొర్రూరు కేంద్రంగా ఐస్ క్రీమ్ తయారీ, చెరుకు రసం వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో అద్దెకుంటున్న ఇంటి ఎదుట దుస్తులు ఆరేసేందుకు తీగలు ఏర్పాటు చేసుకున్నాడు. గురువారం రాత్రి స్నానం చేసి దుస్తులు ఆరేస్తున్న క్రమంలో తీగకు విద్యుత్ ప్రసరించింది. దీంతో షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య రిషిత, కుమార్తె, కుమారుడు ఉన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించి నమోదు చేసుకున్నారు.

ఇస్త్రారి పరిశోధనకు పేటెంట్

- అభినందించిన రిజిస్ట్రార్ మల్లారెడ్డి


ఇస్త్రారిని అభినందిస్తున్న కేయూ రిజిస్ట్రార్ మల్లారెడ్డి, పక్కన కోలశంకర్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ జువాలజీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ మామిడాల ఇస్త్రారి, రీసెర్చ్ స్కాలర్ రాకేశ్ కలిసి చేసిన పరిశోధనకు పేటెంట్ లభించింది. 'ఆంత్రాక్వినోస్ ఆఫ్ రుమెక్స్ వేసి కారియాస్ యాజ్ ఏడై పెప్టిడైల్ పెప్టీడేజ్ ఇన్హిబిటార్' అనే అంశంపై చేసిన పరిశోధనకుగాను భారత ప్రభుత్వం పేటెంట్ కార్యాలయం డాక్టర్ ఇస్త్రారికి పేటెంట్ సర్టిఫికెట్ జారీచేసింది. ఈ మేరకు కేయూ రిజిస్ట్రార్ పి మల్లారెడ్డి గురువారం యూనివర్సిటీలో ఇస్త్రారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ డాక్టర్ కోల శంకర్ కూడా ఉన్నారు. ఈ సందర్భంగా మామిడాల ఇస్త్రారి తన పరిశోధన అంశం గురించి వివరించారు. డీపీపీ -4 అనే ఎంజైమ్ ఇన్సులిన్ విడుదలకు తోడ్పడే జీఎల్‌పీ -1 హార్మోన్‌ను నిరోధిస్తుందన్నారు. ఈ డీపీపీ -4 ఎంజైమ్ క్రియాశీలతను తగ్గిస్తే ఇన్సులిన్ విడుదలకు ఎలాంటి ఆటంకం లేకుండా జరుగుతుందని తెలిపారు. అందుకే రుమేక్స్ వేసికేరియస్ అనే మొక్క నుంచి ఆంత్రాక్వినోస్ రకానికి చెందిన రసాయనిక మూలకం ద్వారా ఈడీపీపీ -4 క్రియాశీలతను తగ్గించేందుకుగాను అనువైన పద్ధతిని ప్రవేశపెట్టినందునకుగాను భారత ప్రభుత్వం తమ పరిశోధనకుగాను పేటెంట్ జారీ చేసిందని తెలిపారు.

హాజరుపై నజర్

ఉద్యోగ సంఘాల నేతలు విధులకు డుమ్మా కొడుతున్నారని ఫిర్యాదులు

- గతంలో ఫుల్‌టైమ్ అనుమతిచ్చిన యాజమాన్యం
- 2023 జనవరి నుంచి ఎత్తివేత
- రాష్ట్ర నాయకులకు సంకట స్థితి
- నేతల హాజరు వివరాలు కోరిన విజిలెన్స్

హన్మకొండ: టీజీ ఎన్పీడీసీఎల్‌లో ఉద్యోగ సంఘాల నాయకుల హాజరుపై యాజమాన్యం దృష్టి సారించింది. ఉద్యోగ సంఘాల నాయకులు, ఉద్యోగుల సంక్షేమ అసోసియేషన్ల నాయకులు విధులకు డుమ్మా కొడుతున్నారని టీజీ ట్రాన్స్‌కో జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్, టీజీ ఎన్పీడీసీఎల్‌కు ఫిర్యాదులందాయి. దీంతో విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టారు. ఈమేరకు ఉద్యోగ సంఘాల నాయకులు పని చేస్తున్న కార్యాలయాల ఉన్నతాధికారులకు వివరాలు పంపాల్సిందిగా లేఖలు రాశారు.

గతేడాది నుంచి ఒకరికే!

రాష్ట్రంలో టీజీ జెన్‌కో, టీజీ ట్రాన్స్‌కో, టీజీ దక్షిణ విద్యుత్ పంపిణీ మండలి, టీజీ ఉత్తర విద్యుత్ పంపిణీ మండలి ఉన్నాయి. గతంలో ఈ నాలుగు విద్యుత్ సంస్థల నుంచి యూనియన్‌కు ఒకరు చొప్పున నలుగురు ఉద్యోగ సంఘాల నాయకులు ఫుల్ టైమ్ అనుమతి తీసుకునేవారు. 2023 క్యాలెండర్ ఇయర్‌లో ఒక యూనియన్ నుంచి నలుగురికి అవకాశం కల్పించకుండా, ఒకే ఒక్క యూనియన్ నుంచి రాష్ట్రంలో ఒక్కరికి మాత్రమే ఫుల్‌టైమ్ ఇవ్వాలని 2022 డిసెంబర్16న జరిగిన తెలంగాణ స్టేట్ పవర్ కంపెనీస్ కో ఆర్డినేషన్ మీటింగ్‌లో నాలుగు విద్యుత్ యాజమాన్య సంస్థలు నిర్ణయం తీసుకున్నాయి. అనంతరం 2023 క్యాలెండర్ సంవత్సరంలో కేవలం ఒక్క యూనియన్‌లో ఒక్కరికి మాత్రమే ఫుల్‌టైం అనుమతికి అవకాశమిచ్చింది. ఇది యూనియన్లు, వెల్ఫేర్ అసోషియేషన్‌లో అప్పట్లో పెద్ద దుమారం లేపింది. ఫుల్‌టైమ్ అంటే యూనియన్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న వ్యక్తి ఆ యూనియన్ సభ్యుల సమస్యల పరిష్కారం కోసం, సమావేశాలకు హాజరవడం, ఇతరత్రా యూనియన్ కార్యకలాపాల్లో పాల్గొనేందుకు విధులకు హాజరు కాకుండా పూర్తి స్థాయిలో మినహాయింపు ఇస్తారు. ఇటు ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూ.. యూనియన్ కార్యకలాపాల్లో పాల్గొనేందుకు వీలు కాదని భావించి సంస్థ ఫుల్‌టైమ్ అనుమతిస్తుంది.

వర్క్‌మెన్ కేడర్‌కు ఇవ్వాలని..

వర్క్‌మెన్ కేడర్‌కే ఫుల్ టైమ్ ఇవ్వాలని విద్యుత్ సంస్థల యాజమాన్యాలు నిర్ణయించాయి. వర్క్‌మెన్ కేడర్ అంటే.. అధికారుల కంటే కింది స్థాయి ఉద్యోగులు, ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్‌లో జేఎల్‌ఎం నుంచి ఫోర్‌మెన్ వరకు, ప్రొవెన్షియల్ (మినిస్టీరియల్) స్టాఫ్‌లో అటెండర్ స్థాయి నుంచి సీనియర్ అసిస్టెంట్ స్థాయి వరకు వస్తారు. ఆతర్వాత స్థాయి వారు వర్క్‌మెన్ కేడర్ పరిధిలోకి రారు. అయితే పలు యూనియన్లకు వర్క్‌మెన్ కేడర్ పై స్థాయి ఉద్యోగంలో కొనసాగుతున్న జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్‌లు రాష్ట్ర స్థాయి కీలక పదవుల్లో కొనసాగుతున్నారు. 2023 నుంచి వీరికి ఫుల్‌టైం అనుమతి నిలిచిపోయింది. దీంతో రాష్ట్ర స్థాయి పదవుల్లో ఉన్న యూనియన్, అసోషియేషన్ల నాయకులు యూనియన్ కార్యక్రమాల్లో పాల్గొనాల్సి రావడం, ఉద్యోగుల సమస్యలు యాజమాన్యాల దృష్టికి తీసుకెళ్లే క్రమంలో విధులకు హాజరు కాలేకపోతున్నారు. దీన్ని అదనుగా తీసుకున్న కొందరు యూనియన్ నాయకులు విధులకు హాజరు కావడంలేదని పేర్లతో సహా టీజీ ట్రాన్స్‌కో, టీజీ ఎన్పీడీసీఎల్ యాజమాన్యాలకు ఫిర్యాదు చేశారు. నిజామాబాద్‌కు చెందిన బీఎంఎస్ నాయకుడు రాజేశ్వర్ రెడ్డి, విద్యుత్ సంస్థల సంక్షేమ సంఘం పేరుతో ఫిర్యాదులు యాజమాన్యాలకు అందాయి. దీంతో విద్యుత్ సంస్థల యాజమాన్యాలు యూనియన్ నాయకులు విధులకు హాజరు అవుతున్నారా? లేదా తెలుసుకునే పనిలో పడింది. సంబంధిత యూనియన్ నాయకుల హాజరు వివరాలు పంపాలని వారు పని చేస్తున్న కార్యాలయాల ప్రధాన అధికారికి విజిలెన్స్ విభాగం లేఖలు రాసింది. దీంతో ఫుల్‌టైం అనుమతి మరోసారి చర్చకు దారితీసింది. హాజరు వివరాలు సేకరించిన అనంతరం యాజమాన్యం ఏ నిర్ణయం తీసుకుంటుందో.. అని ఉద్యోగులు చర్చించుకుంటున్నారు.



సైలానీబాబా ఉర్సుకు వేళాయె..


ఏర్పాట్లు పరిశీలిస్తున్న సీఐ రంజిత్‌కుమార్


సైలానీబాబా దర్గా

- రేపటి నుంచి జాతర ప్రారంభం
- వివరాలు వెల్లడించిన దర్గా పీఠాధిపతి అబ్దుల్ హమీద్

దామెర: హనుమకొండ జిల్లా దామెర మండలం ఓగ్లాపూర్ సమీపంలోని సైలానీ బాబా దర్గాలో 117వ హజ్రత్ సైలానీ బాబా గంధం (ఉర్సు) ఉత్సవాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు దర్గా పీఠాధిపతి మహమ్మద్ అబ్దుల్ హమీద్ గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు ప్రకటించారు. జూన్1న (శనివారం) రాత్రి గంధం జాతర ప్రారంభం అవుతుందన్నారు. ఇందులో భాగంగా మహారాష్ట్ర నుంచి ప్రత్యేకంగా తీసుకొచ్చిన బ్యాండ్ కళాకారుల నృత్యాలు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పకీర్ల విన్యాసాలు కనువిందు చేస్తాయన్నారు. తెల్లవార్లు జరిగే ఈ ఉత్సవంలో ప్రత్యేకంగా అలంకరించిన ఒంటెలపై తీసుకొచ్చిన గంధం దర్గాలో సమర్పిస్తామన్నారు. అనంతరం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పీఠాధిపతులు ప్రార్థనలు చేస్తారన్నారు. ఉత్సవాల్లో భాగంగా రెండో 2న (ఆదివారం) రాత్రి ఖవ్వాలీ బృంద కళాకారులతో ప్రదర్శనలు, 3వ రోజు జూన్3న (సోమవారం) తహెల్ ఫాతేహా కార్యక్రమం నిర్వహించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేస్తామని వెల్లడించారు.

దేశం నలుమూలల నుంచి భక్తుల రాక..

మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాలకు ఉమ్మడి రాష్ట్రంతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక, మధ్యప్రదేశ్, రాజస్తాన్ నుంచి కూడా భక్తులు హాజరవుతారని నిర్వహకులు తెలిపారు. సుమారు రెండు లక్షల మంది హాజరయ్యే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. కాగా, దర్గా ప్రాంగణాన్ని పరకాల రూరల్ సీఐ రంజిత్ రావు, ఎస్సై కొంక అశోక్ పరిశీలించారు. వీరివెంట రషీద్ బాబా, అమీర్ బాబా, ఎస్‌కే మోయిన్ సైలానీబాబా ఖాదీమ్ తదితరులు ఉన్నారు.

పోలీసులకు చిక్కిన ఘరానా మోసగాడు

- బ్యాంకు బంగారం కాజేసిన గోల్డ్ అప్రైజర్ అరెస్ట్
- వివరాలు వెల్లడించిన ఏటూరునాగారం ఏఎస్పీ మహేష్ గీతె బాబాసాహెబ్


ప్రశాంత్ అరెస్ట్ చూపుతున్న పోలీసులు

ఏటూరునాగారం: బ్యాంకులో కుదవపెట్టిన బంగారం కాజేసిన గోల్డ్ అప్రైజర్ సమ్మెట ప్రశాంత్‌ను అరెస్ట్ చేసినట్లు ఏటూరునాగారం ఏఎస్పీ మహేష్ గీతె బాబాసాహెబ్ తెలిపారు. ఈ మేరకు గురువారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఘటనకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. ములుగు జిల్లా మంగపేట మండలం రాజుపేటలోని కెనరా బ్యాంక్‌లో ప్రశాంత్ గోల్డ్ అప్రైజర్‌గా పనిచేస్తూనే సొంతంగా బ్యాంకు పక్కనే సాయిరామ్ జువెల్లర్స్ షాపు నిర్వహిస్తున్నాడు. మూడు నెలల నుంచి వినియోగదారులు బాంకులో లోన్ కోసం కుదువపెట్టిన బంగారం కాజేసి సొంత అవసరాలకు వాడుకున్నాడు. తన షాపునకు వచ్చే కస్టమర్లు నగల కోసం అడ్వాన్స్‌గా ఇచ్చే డబ్బును స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడికి ఉపయోగిస్తూ మొదట రూ. ఐదు లక్షలు నష్టపోయాడు. తరువాత మరో రూ. ఐదు లక్షలు..ఇలా సుమారు రూ. 70లక్షల వరకు నష్టపోయాడు. ఈ క్రమంలో వినియోగదారులు తాము ఇచ్చిన డబ్బుకు బంగారం ఇవ్వాలని, లేదా డబ్బు ఇవ్వాలని ఒత్తిడి తెచ్చారు. దీంతో ఎలాగైనా కస్టమర్లకు డబ్బు ఇవ్వాలనే ఉద్దేశంతో తాను అప్రైజర్‌గా పనిచేస్తున్న కెనరా బ్యాంకును టార్గెట్ చేసుకున్నాడు. ఇందులో భాగంగా వినియోగదారులు బ్యాంకులో కుదవ పెట్టి డబ్బు తీసుకునేందుకు ఇచ్చిన బంగారాన్ని క్రమక్రమంగా కాజేయడం మొదలు పెట్టాడు. లోన్ కోసం వస్తున్న వారి బంగారం పరీక్షిస్తున్నట్లు నమ్మించి ఎవరూ చూడని సమయంలో ఆ బంగారం కాజేసి దాని స్థానంలో నకిలీ గోల్డ్ ప్యాకెట్ ఉంచేవాడు. ఇలా మూడు నెలల నుంచి బ్యాంకులో 24 మంది కస్టమర్లకు చెందిన బంగారాన్ని ఇదే తరహాలో కాజేశాడు. ఈ ఘటనపై బ్యాంకు అధికారుల ఫిర్యాదు మేరకు కేసు పోలీసులు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఈ క్రమంలో ఏటూరునాగారంలోని ఎక్కెల క్రాస్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో ప్రశాంత్ పట్టుబడ్డాడు. దీంతో అతడి నుంచి రూ.2,82,000 లక్షల విలువైన 47 గ్రాములు బంగారం, రూ. 2లక్షల 19వేల విలువైన 2.190 కిలోల వెండి, రూ. 2.51లక్షల నగదు, ఓ కారు, 8 మొబైల్స్ స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్పీ తెలిపారు. అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

కుళ్లిన మాంసం ముద్దలు.. బూజుపట్టిన చేప ముక్కలు

- హానికర రంగులతో తినుబండారాలు
- ఆహార పదార్థాల్లో పురుగులు.. కాలం చెల్లిన సరుకులు..
- హనుమకొండలోని మూడు హోటళ్లలో అధికారుల తనిఖీలు
- కళ్లు బైర్లు కమ్మే నిజాలు వెలుగులోకి..


హనుమకొండలోని ఓ హోటల్‌లో ఆహార పదార్థాలు తనిఖీ చేస్తున్న ఫుడ్‌సేఫ్టీ అధికారులు

వరంగల్ అర్బన్/ హన్మకొండ: నిషేధిత ప్లాస్టిక్ కవర్లలో కుళ్లిన మాంసం ముద్దలు.. బూజుపట్టి పట్టిన చేప ముక్కలు.. బొద్దింకలతో కూడిన ఇడ్లీ పిండి, బెల్లం.. హానికర రంగులతో పన్నీరు.. తుప్పు పట్టిన వంట పాత్రలు.. అపరిశుభ్రత వాతావరణం.. కాలం చెల్లిన సరుకులు.. ఇలా గురువారం హనుమకొండలోని మూడు పేరుగాంచిన హోటళ్లలో అధికారులు తనిఖీలు చేపట్టగా కళ్లు బైర్లు కమ్మే నిజాలు వెలుగు చూశాయి. రాష్ట్ర వ్యాప్త తనిఖీల్లో భాగంగా హనుమకొండలో రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో జోనల్ ఫుడ్ కంట్రోలర్ టి. జ్యోతిర్మయి ఆధ్వర్యంలో అధికారులు పలు హోటళ్లలో సోదాలు నిర్వహించారు. హనుమకొండలోని అరణ్య, జంగల్ థీమ్ రెస్టారెంట్‌లో ప్రమాదకర ప్లాస్టిక్ కవర్లలో భారీగా మాంసపు ఉత్పత్తుల నిల్వ బయటపడ్డాయి. హానికర రంగులు కలిపిన పన్నీరు, తుప్పు పట్టిన వంట పాత్రలు, ఫంగస్‌తో కూడిన బూజు పట్టిన కూరగాయలు గుర్తించారు. దీంతో హోటల్ యాజమాన్యంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే 26 కేజీల మాంసం ఉత్పత్తులు స్వాధీనం చేసుకుని నిర్వాహకులకు నోటీసులు జారీ చేశారు. అలాగే, హనుమకొండ ఆర్‌టీసీ బస్టాండ్ సమీపంలోని శ్రేయ హోటల్‌లో తనిఖీలు నిర్వహించారు. ఇందులో కృత్రిమ హానికర రంగులు కలిపి చేసిన చికెన్ కబాబ్స్, మాంసపు ఉత్పత్తులు, తదితర ఆహార పదార్థాలను అపరిశుభ్ర వాతావరణంలో తయారు చేసి వినియోగదారులను అనారోగ్యాల పాలు చేస్తున్నట్లు గుర్తించారు. ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్న సదరు హోటల్ యాజమాన్యానికి నోటీసులు జారీ చేశారు. సుమారు 11 కేజీల రంగు కలిపిన, బూజు పట్టిన చికెన్, ఫ్రిపేర్ ఫిష్ టిక్కా, బొద్దింకలతో కూడిన ఇడ్లీ పిండి, బెల్లం ధ్వంసం చేసి నోటీసులు అందచేశారు.

హోటల్ అశోకాకు ఇంప్రూవ్మెంట్, ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ నోటీసులు..

హనుమకొండ చౌరస్తాలోని అశోకా హోటల్ (కాకతీయ హోటల్స్ ప్రైవేట్ లిమిటెడ్)ను తనిఖీ చేయగా హానికర కృత్రిమ రంగులు కలిపిన ఆహార పదార్థాలు లభించాయి. అలాగే, భారీగా రంగు డబ్బాలు, రీ-యూజుడ్ 10 లీటర్ల మంచి నూనె, కాలం చెల్లిన కసూరి మేతి, ఎవరెస్టు చికెన్ మసాలా, కాల పరిమితి ముగిసిన సాస్ బాటిల్స్ స్వాధీనం చేసుకున్నారు. అలాగే, బ్యాచ్ నంబర్, మ్యానుఫ్యాక్చరింగ్ డేట్ లేకుండా స్టోర్ రూమ్‌లో నిల్వ ఉంచిన రూ. 5,500 విలువైన 17 నూడుల్స్ ప్యాకెట్లు, 28 సోంపు ప్యాకెట్లు సీజ్ చేశారు. శాంపిల్స్ తీసి ప్రయోగశాలకు తరలించారు. హోటల్ యాజమాన్యానికి ఇంప్రూవ్మెంట్ నోటీస్, ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ నోటీసు జారీ చేశారు. అనంతరం బల్దియాకు చెందిన వాహనం ద్వారా కుళ్లిన మాంసం వ్యర్థాలను తరలించి పూడ్చి పెట్టారు. ఈ స్పెషల్ డ్రైవ్‌లో హనుమకొండ ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ పి వేణుగోపాల్ , వరంగల్ ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ సీహెచ్. కృష్ణమూర్తి, మహబూబ్‌నగర్ జిల్లా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ పి. మనోజ్ కుమార్, నల్లగొండ జిల్లా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ పి. స్వాతి, తదితరులు పాల్గొన్నారు.

భూమి దక్కదనే మనస్తాపంతో రైతు ఆత్మహత్య


సారయ్య(ఫైల్)

సంగెం: భూమి విషయంలో తిట్టి అవమానించారని, భూమి దక్కదని మనస్తాపం చెందిన ఓ వృద్ధ రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్య యత్నించి చికిత్స మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. వరంగల్ జిల్లా సంగెం మండలం ముమ్మడివరం గ్రామానికి చెందిన దామెర్ల సారయ్య(70కు ఇద్దరు కుమారులు రాజేశ్వర్, విజయ్‌కుమార్ ఉన్నారు. తన కున్న వ్యవసాయ భూమిని ఇద్దరు కుమారులకు సమానంగా పంచి ఇచ్చాడు. ఇటీవల చిన్న కుమారుడు విజయ్‌కుమార్ తన భూమిని హనుమకొండకు చెందిన లాయర్ నిమ్మాని శేఖర్‌రావు, విజయలక్ష్మి దంపతులకు విక్రయించేందుకు ఒప్పందం కుదుర్చుకుని బయానాగా రూ.1.50లక్షలు తీసుకుని, పట్టాదార్ పాస్‌బుక్ ఇచ్చారు. ఈ విషయం విజయ్‌కుమార్ భార్య రవళికి తెలిసి భూమి విక్రయించొద్దని గొడవ చేసింది. దీంతో విజయ్‌కుమార్ తన భార్య రవళి, తండ్రి సారయ్య(మృతుడు), పెద్ద మనుషులతో కలిసి లాయర్ శేఖర్‌రావు ఇంటికి వెళ్లి అడ్వాన్స్ తీసుకున్న డబ్బులు తిరిగి ఇస్తాం.. మా పట్టాదార్ పాస్‌బుక్ ఇవ్వాలని కోరారు. దీంతో లాయర్ దంపతులు అసభ్యపదజాలంతో దూషించి వెళ్లగొట్టారు. ఈ క్రమంలో వారం క్రితం విజయ్‌కుమార్, రవళి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా కుటుంబీకులు ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. తన కుటుంబంలో గొడవలకు కారణం లాయర్ శేఖర్‌రావు, విజయలక్ష్మి దంపతులేనని.. భూమి దక్కదని మనస్తాపానికి గురైన సారయ్య బుధవారం రాత్రి వ్యవసాయ బావి వద్దకు వెళ్లి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబీకులు వరంగల్ ఎంజీఎం తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనపై సారయ్య పెద్ద కుమారుడు రాజేశ్వర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేశ్ వెల్లడించారు.

వరంగల్ పాఠక్ మహాల్‌లో వివాహిత..

రామన్నపేట : మనస్తాపంతో ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన వరంగల్ పటాక్ మహాల్‌లో జరిగింది. మట్టెవాడ సీఐ గోపి కథనం ప్రకారం.. నాక్ సేవిక్ సమితి అనుబంధంగా ఉన్న వైదేహి ఆశ్రమంలో ఉంటున్న భవ్య(23)కు వరంగల్ పాఠక్‌మహాల్‌కు చెందిన గంప రాజేశ్‌తో వివాహం జరిగింది. ఈ దంపతులకు మొదటి సంతానంగా కుమారుడు జన్మించి ప్రస్తుతం 18 నెలలు ఉన్నాడు. రెండో కాన్పులో మూడు నెలల తరువాత అబార్షన్ కావడంతో మనస్తాపానికి గురైన భవ్య.. 29వ తేదీన ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనపై సేవి సమితి కార్యనిర్వహక కార్యదర్శి కవితి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ గోపి తెలిపారు.

ఆన్సర్ బుక్‌లెట్‌లనే మార్చేస్తున్నారు



- పరీక్షల విభాగం నుంచి తీసి మళ్లీ పెట్టడం..
- దినసరి వేతన కూలీల నిర్వాకం
- పోలీసుల అదుపులో ఇద్దరు కూలీలు
- విద్యార్థులను పాస్ చేసేందుకు అడ్డదారి..
- ఒక్కోపేపర్‌కు రూ.5వేలు చొప్పన తీసుకుంటున్న వైనం

కేయూ క్యాంపస్: విద్యార్థులు అడ్డదారిలో పాసయ్యేందుకు యత్నిస్తారు. దీనిని ఆసరా చేసుకుని కాకతీయ యూనివర్సిటీ పరీక్షల విభాగంలో విధులు నిర్వర్తించే దినసరివేతన కూలీలు.. విద్యార్థులు రాసిన ఆన్సర్ బుక్‌లెట్‌లు తీసి మళ్లీ విద్యార్థులకు అందజేసి జవాబులు రాసుకొచ్చి గుట్టుచప్పుడు కాకుండా మళ్లీ జవాబుపత్రాల బండిల్స్‌లో పెడుతున్నారు. ఇది కాస్తా సీసీ ఫుటేజీలో నిక్షిప్తమై పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య నర్సింహాచారి దృష్టికొచ్చింది. దీంతో నర్సింహాచారి వెంటనే రిజిస్ట్రార్ దృష్టికి తీసుకెళ్లడతో ఆయన పోలీసులకు సమాచారం ఇవ్వడంతో కేయూ ఎస్సై రాజ్‌కుమార్ పరీక్షల విభాగంలోని ఇద్దరు దినసరి వేతన కూలీలను అదుపులోకి తీసుకున్నారు. పది మందికి పైగా దినసరివేతన కూలీల సెల్‌ఫోన్లు సీజ్ చేసి తీసుకెళ్లి, విచారణ జరపుతున్నారు. ఈ ఘటన కేయూలో సంచలనం కలిగిస్తోంది. వివరాలిలా ఉన్నాయి.. కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాలోని డిగ్రీ బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ తదితర కోర్సుల 2వ ,4వ, 6వ సెమిస్టర్ల పరీక్షలు ఈనెల 6వ తేదీ నుంచి నిర్వహిస్తున్నారు. పరీక్ష కేంద్రాల నుంచి జవాబుపత్రాలు కేయూ పరీక్షల విభాగానికి వస్తున్నాయి. ఇక్కడ జవాబుపత్రాలను భద్రపరిచే క్యాంపు ఉంటుంది. అందులో సుమారు 20మంది దినసరివేతన కూలీలు పనిచేస్తున్నారు. కోడింగ్ ప్రక్రియ జరగక ముందే పరీక్షల విభాగం క్యాంపులోకి వివిధ కళాశాలలనుంచి వచ్చిన జవాబుపత్రాల ఆన్సర్ షీట్ బుక్‌లెట్లు బండిల్స్ చేరి ఉన్నాయి. ముగ్గురు దినసరి వేతన కూలీల్లో ఒకరు సీసీ కెమెరాకు అడ్డంగా కూర్చుంటే మరో ఇద్దరు ఏ విద్యార్థి పాస్ కావాలనుకుంటున్నారో.. వారి ఆన్సర్ షీట్ బుక్‌లెట్‌లను తీసి బయటకు తీసుకెళ్తారు. ఆన్సర్ షీట్‌లో అప్పటికే ఖాళీగా ఉన్న పేపర్లలో జవాబులు రాయించుకొని తీసుకొచ్చి మళ్లీ గుట్టుచప్పుడు కాకుండా ఏ కళాశాల బండిల్స్ నుంచి తీసారో.. అదే బండిల్స్‌లో పెడుతున్నారు. ఇది కాస్తా సీసీ ఫుటేజీలో నిక్షిప్తం కావడంతో గుట్టురట్టైంది.

ఒక పేపర్ మార్చితే రూ.5వేలు

పరీక్షల విభాగంలో దినసరివేతన కూలీలను విచారించగా పలు ఆశ్చర్యకర విషయాలు వెల్లడైనట్లు సమాచారం. యూనివర్సిటీ బయట ఉన్న ఓ టీమ్ ద్వారా పరీక్ష పత్రాల మార్పిడి తతంగం జరుగుతున్నట్లు తేలింది. పరీక్షల విభాగంలోంచి తాము ఒక ఆన్సర్ బుక్ లేట్‌ను బయటకు తీసుకెళ్లి రాయించి మళ్లీ తీసుకొచ్చి బండిల్స్‌లో పెడితే ఒక్కో పేపర్‌కు రూ.5వేలు తీసుకుంటున్నట్లు ఇద్దరు కూలీలు పోలీసుల సమక్షంలో అంగీకరించినట్లు తెలిసింది. తమతోపాటు మరో 10మందికిపైగానే ఈ వ్యవహారంలో ఉన్నారనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. గురువారం ఇద్దరు కూలీలను పోలీసులు అదుపులోకి తీసుకుని మరో పదిమందికిపైగానే దినసరివేతన కూలీలకు సంబంధించిన సెల్‌ఫోన్‌లను సీజ్ చేసి తీసుకెళ్లారని సమాచారం. ప్రాథమికంగా 20 జవాబుపత్రాలు మార్చినట్లు వెల్లడైంది.

గమనించిన పరీక్షల నియంత్రణాధికారి

పరీక్షల నియంత్రణాధికారి ఆఫీస్‌లో నుంచి సీసీ కెమెరాల ద్వారా యూనివర్సిటీ పరీక్షల విభాగంతో పాటు, క్యాంపులో ఉండే జవాబుపత్రాల బండిల్స్ వద్ద ఏం జరుగుతోందో పర్యవేక్షించే అవకాశం ఉంటుంది. అయితే క్యాంపులో ఒకరు సీసీ కెమెరాకు అడ్డంగా కూర్చోవడం మరో ఇద్దరు కూడా జవాబపత్రాల బండిల్స్ నుంచి ఆన్సర్ బుక్‌లెట్ తీయడం లాంటివి తీస్తున్నట్లు పరీక్షల నియంత్రణాధికారి నర్సింహాచారి గమనించారు. ఈ వ్యవహారాన్ని గురువారం కేయూ రిజిస్ట్రార్ మల్లారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. కేయూ ఎస్సై రాజ్‌కుమార్ తన సిబ్బందితో పరీక్షల విభాగానికి వచ్చారు. క్యాంపులో పని చేస్తున్న దినసరి వేతన కూలీలను విచారించారు.

గతంలోనూ ఇలాంటి ఘటనే..

కొంతకాలం క్రితం క్యాంపస్‌లోని ఇంజనీరింగ్ కళాశాలలో పనిచేసే రెగ్యులర్ ఉద్యోగి దూరవిద్య బీఎల్ఐఎస్సీ కోర్సులో పరీక్షలు రాశాడు. పరీక్షల విభాగంలో పనిచేసే ఇద్దరు తాత్కాలిక ఉద్యోగులతో తాను రాసిన జవాబుపత్రాలను తెప్పించి, మళ్లీ రాసి అందులోనే పెట్టించాడు. దీంతో అప్పటి పరీక్షల నియంత్రణాధికారి మల్లారెడ్డి వారిని విధుల నుంచి తొలగించారు. ఆ రెగ్యులర్ ఉద్యోగికి కేవలం ఇంక్రిమెంట్ కట్‌చేసి వదిలేశారు. అప్పట్లో పోలీసుకు ఫిర్యాదు చేసి ఉంటే ఈ దందాకు తెరపడేది. కానీ, అలా చేయకుండా వదిలేయడం వల్లే ఇలా జరిగిందని పలువురు చర్చించుకుంటున్నారు.

ఆవేశంలో అనంతలోకాలకు..

పరిపక్వత లేని వయసు.. మంచి, చెడులు పట్టించుకోని స్వభావం.. పైగా క్షణికావేశం.. ఇంకేముంది అనాలోచిత నిర్ణయంతో తనువులు చాలిస్తున్నారు. తల్లిదండ్రులు మందలించారనే కారణంతో పిల్లలు మనస్తాపం చెంది అర్ధాంతరంగా జీవితాలు ముగిస్తున్నారు. కారణాలు విశ్లేషించుకోకుండా బలవన్మరణాలకు పాల్పడుతూ తల్లిదండ్రులకు కడుపుకోత మిగుల్చుతున్నారు.

తండ్రి మందలించాడని.. తనయుడి బలవన్మరణం


అవీజ్(ఫైల్)

గీసుకొండ : తండ్రి మందలించాడనే కారణంతో మనస్థాపం చెందిన ఓ యువకుడు బావిలోకి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం.. షేక్ అవీజ్(18) అనే యువకుడు వరంగల్ ఆటోనగర్‌లో వెల్డింగ్ రిపేరింగ్ పనులు చేస్తున్నాడు. ఈ నెల 27న పని సరిగా చేయడం లేదని తండ్రి మందలించాడు. దీంతో మనస్తాపానికి గురైన అవీజ్.. పనికి వెళుతున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. తెలిసిన వారు, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. ఈ క్రమంలో గురువారం గొర్రెకుంటలోని కందుల రమేశ్ వ్యవసాయ బావిలో అవీజ్ మృతదేహం తేలింది. దీనిని పరిశీలించిన తండ్రి షేక్ ఇమాం.. ఆ మృతదేహం తన కుమారుడిదని గుర్తించారు. అనంతరం షేక్ ఇమాం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు గీసుకొండ సీఐ ఎల్. పవన్‌కుమార్ తెలిపారు.

మైసంపల్లిలో బాలుడు..

దుగ్గొండి: ఎండలు తీవ్రంగా ఉన్నాయని, ఇంట్లోనే ఉండాలని తల్లి మందలించిందనే కారణంతో ఓ బాలుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన గురువారం వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం మైసంపల్లిలో జరిగింది. గ్రామానికి చెందిన మోకిడె శాంత భర్త రాజు కొంత కాలం క్రమృతి చెందడంతో కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంది. ఇద్దరు కుమారులు ఉండగా పెద్ద కుమారుడు శివప్రసాద్‌ను టెన్త్ క్లాస్ కోచింగ్‌కు పంపింది. చిన్న కుమారుడు కాంతారావు(సిద్ధు)(9) మూడో తరగతి పూర్తి చేశాడు. ఈ క్రమంలో వేసవి ఎండలు తీవ్రంగా ఉన్నాయని ఇష్టం వచ్చినట్లు తిరుగుతున్నావని, ఇంట్లోనే ఉండాలని మందలించింది. దీనిపై మనస్తాపం చెందిన సిద్ధు.. తల్లి కూలీ పనులకు వెళ్లిన అనంతరం ఉరేసుకున్నాడు. ఇది గమనించిన ఇరుగుపొరుగు వారు కాపాడే ప్రయత్నం చేయగా అప్పటికే మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి మేనమామ డోలె యువరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జక్కుల పరమేశ్ తెలిపారు.

కారు, బైక్ ఢీ..మహిళ మృతి

ఖానాపురం : కారు.. ఓ ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో మహిళ మృతి చెందగా యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన గురువారం ఖానాపురం మండలంలో చోటుచేసుకుంది. స్థానికుల ప్రకారం.. ములుగు జిల్లా రాయినిగూడేనికి చెందిన గొంది నర్సమ్మ(51) మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం సాధిరెడ్డిపల్లిలో శుభకార్యానికి హాజరైంది. నర్సంపేటలో పనుల నిమిత్తం అదే గ్రామానికి చెందిన తన బంధువు పులుసం రవికిరణ్ బైక్‌పై వచ్చింది. పనులు ముగించుకుని సాధిరెడ్డిపల్లికి తిరుగుపయనమయ్యారు. ఈ క్రమంలో హైదరాబాద్‌కు చెందిన ఐదుగురు యువకులు కారులో భద్రాచలం వెళ్లి హనుమకొండకు వస్తున్నారు. మండలంలోని చిలుకమ్మనగర్ చెక్‌పోస్టు సమీపంలో కారు.. బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నర్సమ్మ, రవికిరణ్‌కు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు వరంగల్ ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ నర్సమ్మ మృతి చెందింది. రవికిరణ్ చికిత్స పొందుతున్నారు. ఘటనా స్థలిని ఎస్సై రఘుపతి సందర్శించి వివరాలు సేకరించారు.